క్లుప్తంగా

సజ్జలను కలిసిన గిరజాల



రామకృష్ణారెడ్డితో గిరజాల బాబు

కడియం: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) గురువారం కలిశారు. తాడేపల్లిలో జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుల సమీక్షా సమావేశానికి హాజరైన గిరజాల పలు అంశాలను సజ్జల దృష్టికి తీసుకువెళ్లారు.

కొనసాగిన రిలే దీక్ష

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం సర్కిల్ జేఏసీ చైర్మన్ జగతా అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. అచ్యుత రామయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం దిశగా మేనేజ్‌మెంట్ అడుగులు వేయాలన్నారు. సెక్రటరీ జనరల్ విద్యాసాగర్, ఏఏవో పీఎస్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు.

తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించాలి

కడియం: బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా కలిగే ప్రయోజనాలను గుర్తించాలని కడియం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ మోహనవంశీ, డాక్టర్ రేష్మ మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. సీసా పాలను నివారించాలని సూచించారు. తల్లిపాలు పట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య సిబ్బంది శ్రీలత, ఎలిజిబెత్ మాట్లాడారు.

రేపు కొవ్వొత్తుల ర్యాలీ

కడియం: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండను నిరసిస్తూ శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ కడియంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మండల పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతి తెలిపారు. కడియం హైస్కూలు మైదానం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ఈ శాంతిర్యాలీ జరుగుతుందన్నారు.

వ్యక్తి అదృశ్యం

ధవళేశ్వరం: గ్రామంలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన 22 ఏళ్ల వంపన వెంకటేష్ అదృశ్యమయ్యాడు. గత నెల 24వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి పోలీసులకు అతడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు చేశారు.

ప్రధాని మోదీకి బీసీ నాయకుల వినతి



ప్రధాని మోదీకి చిత్రపటం అందజేస్తున్న ఎంపీ కృష్ణయ్య, డాక్టర్ పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: పార్లమెంట్‌లో మహిళ బిల్లు ప్రవేశ పెట్టి, బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అభ్యర్థించారు. గురువారం ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో డాక్టర్ పద్మలత తోపాటు పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రధాని నరేంద్రమోదీని కలిసి వినతిపత్రం అందించారు. పద్మలత మాట్లాడుతూ సినిమాలలో అసభ్యకర అంశాలు ముఖ్యంగా అశ్లీల దృశ్యాలు పూర్తిగా నిషేధించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి వెళ్లి పింఛన్ పంపిణీ



సూర్యకాంతానికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ గ్రేస్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని అయ్యప్పనగర్‌లో నివసించే యాకుల సూర్యకాంతం అనే 85 ఏళ్ల మహిళ ఇంటి దగ్గర పరిస్థితులు అనుకూలించక దేవరపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలోని వృద్ధాశ్రమంలో జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో 15వ డివిజన్ తాడితోట 29వ సచివాలయం వలంటీర్ వార గ్రేస్ తన సొంత ఖర్చులతో అక్కడకు వెళ్లి సూర్యకాంతానికి వృద్ధాప్య పింఛన్ అందజేసింది. వలంటీర్ సేవలను పలువురు అభినందించారు.

సహకారంతోనే పురస్కారం

- సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధనకు కృషి
- చర్యలు చేపట్టిన కార్పొరేషన్
- ఆగస్టు 15 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ
- సర్వే పనిలో సిబ్బంది
- అక్టోబర్ 2న ర్యాంకుల ప్రకటన



సర్వేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించడానికి నగర ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరం. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఆగస్టు 15 వరకూ నిర్వహించనున్న సర్వేలో నగర ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపు నిచ్చారు.

ప్రగతి ఆధారంగా ర్యాంకులు

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య మెరుగుకు స్వచ్ఛత పోటీలను 2016 నుంచీ నిర్వహిస్తోంది. నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలలో సాధించిన ప్రగతి ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తోంది. మొత్తం ఎనిమిది విభాగాలకు 9,500 మార్కులు కేటాయించారు. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులు విభజించారు. త్వరలో కేంద్ర బృందాలు నగరపాలక సంస్థలో పారిశుధ్యం కోసం తీసుకుంటున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా, అక్టోబర్ 2 (గాంధీ జయంతి)న కేంద్ర ప్రభుత్వం ర్యాంకులు, పురస్కారాలను ప్రకటించనుంది. ఇందుకోసం www.mygov.in/mygov-urvey/swachhsurvehshan-2023 ద్వారా ఆన్‌లైన్‌లో సమాధానాలు నమోదు చేయాలి.

మెరుగైన ర్యాంకు సాధిస్తే అధిక నిధులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకులు సాధించిన నగరపాలక సంస్థలకు, మున్సిపాలిటీలకు అధికంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. గత ఏడాది రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు 94వ ర్యాంకు వచ్చింది. ఈసారి 20వ ర్యాంకు సాధించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రత్యేక శ్రద్ధ చేపట్టడంతో ఇంటింటి చెత్తసేకరణ మెరుగు పడింది. డస్ట్‌బిన్ ఫ్రీ సిటీగా తయారు చేసి ఉత్తమ ర్యాంకు సాధనే లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు కృషి చేస్తున్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి



కేంద్ర ప్రభుత్వం ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ -2023లో రాజమహేంద్రవరం మెరుగైన ర్యాంకు సాధించేందుకు నగర ప్రజలు సహకరించాలి. యాప్‌ల ద్వారా సిటిజన్ ఫీడ్ బ్యాక్ కోసం ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సచివాలయం పరిధిలో వలంటీర్లు, సెక్రటరీలు దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లు, సెక్రటరీలకు, మెప్మా సిబ్బందికి తెలియజేయాలి. ఓటీపీపై ఎటువంటి అపోహలకు పెట్టుకోవద్దు.

– దినేష్ కుమార్, కార్పొరేషన్ కమిషనర్

చిన్న పిల్లల వ్యాధులపై అవగాహన



పిల్లల వైద్యుడు కేవీడీ ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్లో మండల అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రాజా హాస్పిటల్‌కు చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల విజృంభిస్తున్న కళ్ల కలక గురించి వివరించారు. తల్లిపాలు ఇవ్వకపోతే చిన్నారులకు వచ్చే ఇబ్బందులు, వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, డెంగీ, టైఫాయిడ్‌కు చేయాల్సిన ప్రాథమిక వైద్యంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రతి పీఎంపీ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్‌గా చక్కటి వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లిక, జిల్లా కో కన్వీనర్లు బళ్లా శ్రీనివాసరావు, కేఎస్ ప్రసాద్, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, సుంకర శ్రీనివాస్, కేవీఎస్ సత్యనారాయణ రెడ్డి, ఎ.సురేష్ బాబు, వందమంది పీఎంపీలు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ కేవీడీ ప్రసాద్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

రాజమహేంద్రవరంలో బేబి యూనిట్ సందడి



అప్సర థియేటర్‌లో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య తదితరుల సందడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బేబి సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు అని ఆ చిత్రం డైరెక్టర్ సాయి రాజేష్ అన్నారు. సినిమా విజయవంతం కావడంతో ఆ చిత్ర యూనిట్ విజయోత్సవ యాత్ర చేపట్టింది. దానిలో భాగంగా గురువారం మార్నింగ్ షో సమయంలో గీతా అప్సరా థియేటర్‌కు చేరుకున్న హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య, ప్రొడ్యూసర్ ఎస్‌కేఎన్ వంశీకృష్ణారెడ్డి, డైరెక్టర్ సాయి రాజేష్, నటుడు విరాజ్ అశ్విన్‌కు విజయలక్ష్మి సినిమాస్ తూర్పు గోదావరి జిల్లా డిస్ట్రిబ్యూటర్లు కర్రి సంజీవరెడ్డి, దుర్గారెడ్డి, అంజిరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. చిత్ర యూనిట్ రావడంతో అభిమానులు సందడి చేశారు. హీరో, హీరోయిన్లతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్లు సినిమాలో పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. చిత్ర యూనిట్‌ను చిరంజీవి యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ పూల మాలలతో అభినందించారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



సాయిధరమ్ తేజ్‌ను సత్కరిస్తున్న అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బ్రో సినిమా విజయయాత్రలో భాగంగా హీరో సాయిధరమ్ తేజ్ గురువారం రాజమహేంద్రవరంలో సందడి చేశారు. ఆ సినిమా ప్రదర్శిస్తున్న అనుశ్రీ థియేటర్‌కు గురువారం రాత్రి విచ్చేసి ప్రేక్షకులతో ముచ్చటించారు. సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. బైక్ మీద వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ, మెగా అభిమానులు వానపల్లి బాబీ తదితరులు ఆయనకు భారీ గజమాల వేసి పూలవర్షం కురిపించారు. ముందుగా థియేటర్ వద్ద ఆయనకు బాణసంచా కాల్పులు, తీన్మార్ డప్పుల మోతతో అనుశ్రీ ఫిలింస్ తరఫున రాజు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

జిల్లా ధార్మిక కమిటీ ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లాకు గురువారం నూతన ధార్మిక కమిటీని ప్రకటించిందని ఆ దేవస్థానం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఓహెచ్ యోగి గురువారం తెలిపారు. ఈ కమిటీలో గౌతమీ ఘాట్ ఆధ్యాత్మిక సంస్థ సమాఖ్య అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తోట సుబ్బారావు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, సత్సంగం నిర్వాహకులు కాలెపు సతీష్, శ్రీవారి సేవకులు అలకాని విజయ్ దుర్గ, వీవీఎస్ ప్రసాద్ ఉన్నారన్నారు. హిందూధర్మ ప్రచారంలో భాగంగా టీటీడీ నిర్వహించే ధార్మిక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఈ జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు కీలక పాత్ర వహిస్తారన్నారు.

అస్తవ్యస్తంగా నగరంలోని డ్రైనేజీలు

ప్రకాశం నగర్: నగరంలోని డ్రైనేజీలు, తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నగర కార్యదర్శి బి.పవన్, పార్టీ నాయకుడు సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన మాట్లాడారు. కొద్దిపాటి వర్షానికే నగరంలో పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. కార్పొరేషన్ అధికారులు మౌలిక వసతులకు కేటాయించాల్సిన నిధులను పైపై హంగులకు, ఆర్భాటాలకు ఖర్చు చేయడం ఏరకమైన అభివృద్ధి అని ప్రశ్నించారు. సుబ్రహ్మణ్యం మైదానంలో చేపట్టిన పనులు నిలుపుదల చేయాలన్నారు.

వైఎస్సార్ పోషణతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారం కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్



ధవళేశ్వరం గొల్లపేటలో కిట్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఉల్లితోటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రక్తహీనత పూర్తిగా తొలగిపోవాలని లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,300 కోట్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు నీలపాల తమ్మారావు, బెజవాడ రాజ్‌కుమార్, నాయకులు రొక్కం త్రినాథ్, అడపా రఘు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ నాయకుడు సాధనాల చంద్రశేఖర్(శివ) ఆధ్వర్యంలో స్థానిక గొల్లపేట రామాలయం వద్ద గురువారం జరిగిన అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో రేగుళ్ల శ్రీను, ఇందల శ్రీను, ముత్యాల అనంతబాబు(జాన్), అయినం చందు, సుంకర వెంకటరమణ, ఇందల ప్రకాశరావు, రాజీక పూర్, నక్కెళ్ల ఉషా, నిమ్మలపూడి సాయి పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

రాజమహేంద్రవరం రూరల్: లాలాచెరువు జంక్షన్‌లో గురువారం రాత్రి పెనుప్రమాదం తప్పింది. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాచెరువు జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ పడడంతో వాహనాలు నిలిచి ఉన్నాయి. ఆ సమయంలో దివాన్‌చెరువు నుంచి దేవరపల్లి రోడ్డు పనికి కంకరలోడు లారీ వేగంగా వచ్చింది. సిగ్నల్ దగ్గరకు వచ్చేసరికి లారీ అదుపుతప్పి ఎదురుగా ఉన్న దొడ్డ డెయిరీ వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆ వ్యాన్ రోడ్డుకు అడ్డంగా తిరిగింది. ఆ వ్యాన్ ఎదురుగా ఉన్న కారును ఢీకొనడంతో కారు వెనుక అద్దం పగిలింది. లారీ ఎడమవైపుకు తిరిగి ఆగిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సరిగ్గా లారీ వెనుక నుంచి వస్తున్న సమయానికి గ్రీన్ సిగ్నల్ పడడంతో కొన్ని వాహనాలు ముందుకు కదిలాయి. లేనిపక్షంలో లారీ వచ్చిన స్పీడుకు పెనుప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్సై బాషా సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

30 గ్రాముల బంగారం చోరీ

కంబాలచెరువు: తన ఇంట్లో 30 గ్రాముల బంగారం చోరీకి గురైందని లలితానగర్ చెందిన వెంకటేశ్వరరావు గురువారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడు అపార్ట్‌మెంట్ బయట బుధవారం రాత్రి తన కుటుంబంతో నిద్రపోయాడు. ఉదయం లేచిచూసేసరికి బీరువాలో బంగారు నగలు మాయమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసం

పుస్తకాలు కొనేందుకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి మోసపోయిన ఘటనపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ గురువారం కేసు నమోదైంది. నెహ్రూనగర్‌కు చెందిన లావణ్య బీటెక్ చదువుతోంది. తనకు అవసరమైన పుస్తకాలను ఈనెల 27న ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టింది. 31న ఒక వ్యక్తి ఫోన్ చేసి పుస్తకాలు డెలివరీ ఇవ్వాలని మీ ఫోన్‌కు ఒక లింక్ పంపానని చెప్పాడు. ఆమె ఆ లింక్ క్లిక్ చేయగా తన బ్యాంకుఖాతాలోని రూ.60 వేలు మాయమయ్యాయి. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా

కంబాలచెరువు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. షిర్డీసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం జరిగిన స్టార్ గ్రూప్ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యార్జన చేసి ఉత్తమ పౌరులుగా ఎదగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించేందుకు షిర్డీసాయి విద్యాసంస్థలు చేస్తున్న కృషిని అభినందించారు. మరో అతిథి, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య, ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎఫ్ఆర్‌సీ సేవలను వినియోగించుకోవాలి



శాస్త్రవేత్త డీవీఎస్ రాజును సత్కరిస్తున్న నర్సరీ అధ్యక్షుడు మల్లు పోలరాజు, పాలక వర్గ సభ్యులు

కడియం: నర్సరీలు, ఉద్యాన పంటల రైతులు వేమగిరిలోని డివిజనల్ ఫ్లోరీకల్చర్ రీసెర్చి సెంటర్ (డీఎఫ్ఆర్‌సీ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్త డీవీఎస్ రాజు కోరారు. ఆయనను గురువారం సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా డీవీఎస్ రాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వివిధ రకాల తెగుళ్లను గురించి తమ దృష్టికి తీసుకువస్తే, వాటికి పరిష్కార మార్గాలను చూపిస్తామన్నారు. తాము ఇప్పటికే పలు రకాల తెగుళ్లపై పరిశోధనలు చేసి, వాటికి తగిన మందులను సూచించామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించేందుకు తమ అసోసియేషన్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. అక్కడకు రాజుతో సహా శాస్త్రవేత్తల బృందం వచ్చి రైతులకు తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యానశాఖాధికారి సుధీర్‌కుమార్, తహసీల్దార్ ఎం.సుజాతను కూడా కొత్తపాలక వర్గం కలిసింది.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ టీకాలు



మిషన్ ఇంద్రధనస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మిషన్ ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ టీకాలు వేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ అధికారులకు ఆదేశించారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలల్లో మిషన్ ఇంద్రధనస్సు 5.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీకాలు వేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి పూట కూడా కొనసాగిస్తామని, ఆ సమయంలో రోడ్లపైన నిద్రించే వారి పిల్లలకు కూడా టీకాలు వేస్తామన్నారు. పుష్కరఘాట్, గౌతమీ ఘాట్, కోటగుమ్మం ఏరియా, రైల్వే స్టేషన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్లు రాజకుమారి, రవి కుమార్, ప్రసన్నపాల్గొన్నారు.

సిటిజన్ ఫీడ్ బ్యాక్ సేకరించాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల సాధనలో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్‌ను ప్రజల నుంచి సేకరించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపు నిచ్చారు. వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఫీడ్ బ్యాక్ కార్యక్రమాన్ని గురువారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు, కార్యదర్శులతో సమీక్షించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



సిమెంటరీపేట పాఠశాలలో భోజనాన్ని తనిఖీ చేస్తున్న స్టేట్‌ఫుడ్ కమిషన్ మెంబర్ జక్కంపూడి కృష్ణ కిరణ్

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా నిర్వహించాలని స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ జక్కంపూడి కృష్ణ కిరణ్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. స్థానిక సిమెంటరీపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక రిజిస్టర్లు, స్టాక్‌ను పరిశీలించారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రాగిజావను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యతను తెలుసుకున్నారు. ఆయన వెంట అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈఓ అయ్యంకి దుర్గాతులసీదాస్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు, అర్బన్ మండల సివిల్ సప్లయిస్ అధికారి మల్లీశ్వరి, ఐసీడీఎస్‌డీడీ, సీడీపీవో ఉన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగు

- సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్
- నగరంలో గడప గడపకూ..



గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. గురువారం 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అర్జరపు వాసు సారథ్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందన్నారు. సచివాలయం సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు చెప్పిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు కొత్త విజయ రాజ్యలక్ష్మి, కాంతా పటేల్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ధ్రువపత్రాలు

పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి.. ధ్రువీకరణ పత్రాలను సైతం ఆ విధంగా అందించే ఏర్పాట్లు చేశారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల విలువైన సమయం వృథా కాకుండా అవసరమైన సర్టిఫికెట్లు ఇంటికే అందించిన ఒక బృహత్తరమైన కార్యక్రమం జగనన్న సురక్ష అన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజల నుంచి అపూర్వమైన స్పందన లభించిందన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నక్కా శ్రీనగేష్ పాల్గొన్నారు.